

ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదు

ఉద్యమ ఆకాంక్ష నెరవేరక రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశలో ఉన్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. - 10లో



హామీలు ఆచరణ సాధ్యం కావు

కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీలు ఆచరణలో సాధ్యం కావని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 10లో



అధికార దుర్వినియోగం

సీఎం కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ మంత్రి నర్సింహులు ఆరోపించారు. - 10లో

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి అమరావతి



మాట్లాడుతున్న అదనపు జడ్జి అమరావతి

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.అమరావతి కోరారు. శనివారం సూర్యాపేటలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసులు, జ్యూడీషియల్ సమన్వయ కృషితో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. క్రిమినల్, సివిల్, వాహన చట్టం, బ్యాంకులు, విద్యుత్ వంటి కేసులతో పాటు, రాజీపడే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని అన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై నివేదిక అందించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న కర్పూరం హర్షవర్ధన్ కుమారుడు ప్రణవ్‌వర్ధన్ తప్పుడు కుల ధ్రువీకరణ పొందారని ఎస్సీ ఐక్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఈనెల 15న ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై 30రోజుల్లో విచారణ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ చైర్మన్, అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డిని శనివారం ఆదేశించారు. ప్రణవ్‌వర్ధన్ సాతాని కులానికి చెందిన (బీసీ–డి) వ్యక్తి అని, కానీ 2018లో సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం పొంది 2022–23 లో నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కళాశాలలో ఆ కోటాలో మెడికల్ సీట్ పొందారని ఫిర్యాదు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయాలకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్): ఆత్మకూర్ మండలం నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు శనివారం అధికారులు వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయల వేలాన్ని నెమ్మికల్‌కు చెందిన బిజిగే సైదులు రూ.10.07లక్షలకు , లడ్డూ, పులిహోర విక్రయాలకు రూ.1.70లక్షలకు అదే గ్రామానికి చెందిన సైదులు దక్కించుకున్నారు. పూజా సామగ్రి విక్రయానికి వేలంలో సరైన ధర రాక వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈఓ కుశలయ్య, సర్పంచ్ దావీదు, ఎంపీటీసీ ముత్తయ్య, ఉపసర్పంచ్ ఉపేందర్, నగేష్, సైదులు, శ్రీనివాస్, రమేష్ స్టాలిన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను నమోదు చేయాలి



ఖర్చుల లెక్కలను పరిశీలిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను విధిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు, ఐఆర్ఎస్ అధికారి ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల వ్యయ ఖర్చులకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు పత్రికలు, టీవీల్లో మూడు సార్లు తమ కేసుల గురించి ప్రచురించి ఆ ఖర్చు వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. అనంతరం స్థానిక సీపీఎం, కాంగ్రెస్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి ఎస్.జగదీశ్వర్‌రెడ్డి, బి.కృష్ణ, సిబ్బంది ఉన్నారు. అనంతరం జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఏ.కౌశిగన్ సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, పి.రఘు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

- నల్లగొండకు ద్రోహం చేసిన కేసీఆర్
- డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి



నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన సకలజనుల విజయ సంకల్ప సభకు హాజరైన జనం

- బ్రాహ్మణవెల్లెంల, శివన్నగూడెం ప్రాజెక్టులను విస్మరించారు
- నల్లగొండ అభివృద్ధికి కేంద్రం రూ.400 కోట్లు ఇచ్చింది
- బీఆర్‌ఎస్ అంటేనే అవినీతి, లంచగొండి పార్టీ
- సకలజనుల విజయ సంకల్ప సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా



అభివాదం చేస్తున్న అమిత్‌షా



అమిత్‌షాకు నమస్కరిస్తున్న బీజేపీ అభ్యర్థులు మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నివేదితారెడ్డి, కృష్ణారెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా అభివృద్ధిపై కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అభివృద్ధిని విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కోరారు. ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల, శివన్నగూడెం ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నల్లగొండ ప్రజలకు సీఎం కేసీఆర్ ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి, లంచగొండి పార్టీ అని ఘాటుగా విమర్శలు చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో అమిత్‌షా మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. నల్లగొండ పట్టణ అభివృద్ధికి కేంద్రం రూ.400 కోట్లు ఇచ్చిందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో కూడా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దళిత బంధు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన చోట బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు కమీషన్లు తీసుకున్నారని దుయ్యబట్టారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలో రూ.కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తారా అని అమిత్ షా ప్రశ్నించగా గెలిపిస్తామని ప్రజలు చేతులెత్తి నినదించారు.

నల్లగొండ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

బీజేపీ నల్లగొండ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నల్లగొండ నుంచి స్థానికేతరులను తరిమితేనే నల్లగొండ అభివృద్ధి సాధ్యమని, గత నాలుగు దశాబ్దాలుగా పక్క నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్లు వచ్చి ఇక్కడ ఎమ్మెల్యే అయి నల్లగొండ అభివృద్ధిని విస్మరించారని తెలిపారు. నల్లగొండలో భూపాల్‌రెడ్డి హయాంలో భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు పెరిగిపోయాయన్నారు. నాగార్జున సాగర్ అభ్యర్థి కంకణాల నివేదితరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని, బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు.

బీజేపీకి పట్టం కట్టాలి

మునుగోడు నియోజకవర్గ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థుల గెలుపుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమని నకిరేకల్ నియోజకవర్గ అభ్యర్థి మొగులయ్య అన్నారు. అన్ని పార్టీలకు అవకాశమిచ్చిన జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని బీజేపీ అభ్యర్థులకు ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని దేవరకొండ అభ్యర్థి లాలునాయక్ అన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా అవినీతి రహిత పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమని పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి సాధినేని శ్రీనివాసరావు అన్నారు. కాగా, అమిత్ షా ప్రసంగాన్ని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలుగులో అనువదించారు. ఈ సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవి, బండారు ప్రసాద్, నాయకులు ప్రదీప్‌కుమార్, పోతెపాక సాంబయ్య, బాబా, పెరిక మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

నల్లగొండ టౌన్: నల్లగొండలో శనివారం జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభ విజయవంతమైంది. ఆశించిన స్థాయిలో సభకు జనం తరలి రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. నల్లగొండ, మునుగోడు, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేశారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా మధ్యాహ్నం 2.22 నిమిషాలకు వేదికపైకి చేరుకోగానే కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. అమిత్‌షా తన 19 నిమిషాల ప్రసంగంలో నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు కుంభకోణాలపై వివరించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అమిత్ షా ప్రసగింస్తున్నంత సేపు కార్యకర్తలు ఉత్సాహంగా ప్రసంగాన్ని వింటూ ఈలలు వేసి అభివాదం చేశారు.

మూడో చోట్ల అదనంగా బ్యాలెట్ యూనిట్లు 1,171

- తుంగతుర్తి ఒకటి, హుజూర్‌నగర్, సూర్యాపేటలో రెండు, కోదాడలో మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లు
- ఇప్పటికే జిల్లాకు వచ్చినవి 2,435.. నియోజకవర్గాలకు తీసుకెళ్లినవి 1,500
- మిగిలి ఉన్నవి 935
- శుక్రవారం ఈసీఐఎల్ నుంచి తెప్పించినవి 570



శుక్రవారం సూర్యాపేటకు వచ్చిన బ్యాలెట్ యూనిట్ల పెట్టెలను దించుతున్న సిబ్బంది

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు తక్కువ పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో 92 మంది బరిలో ఉన్నారు. తుంగతుర్తి మినహా మూడు చోట్ల 16 కంటే ఎక్కువ మంది పోటీలో ఉండడంతో1,171 అదనపు ఈవీఎంలు అవసరం వచ్చాయి. జిల్లాలో 1201 పోలింగ్ కేంద్రాలు ఉండగా తుంగతుర్తి నియోజకవర్గంలోని 326 పోలింగ్ కేంద్రాలు మినహా 875 పోలింగ్ కేంద్రాల్లో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం. కాగా జిల్లాకు 2,435 బ్యాలెట్ యూనిట్లు రాగా మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి జిల్లాలోని 1,201 పోలింగ్ కేంద్రాలకు కేంద్రానికి ఒకటి చొప్పున అదనంగా 25శాతం కలిపి 1,500 కేటాయించారు. ఇంకా935బ్యాలెట్ యూనిట్లు మిగిలి ఉండగా అదనంగా అవసరం ఉన్న ఈవీఎంలను ఈసీఐఎల్ నుంచి శుక్రవారం తీసుకువచ్చారు.

బరిలో ఉన్న అభ్యర్థులు

ఒక్కొక్క బ్యాలెట్ యూనిట్‌పై నోటాతో కలిపి 16 గుర్తులకు అవకాశం ఉంటుంది. అంటే 15 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే ఒక ఈవీఎంతో ఎన్నికలు నిర్వహించవచ్చు. 15 మంది అభ్యర్థుల గుర్తులతో పాటు నోటా గుర్తు ఈవీఎంలో పొందుపర్చి ఎన్నికలు నిర్వహిస్తారు. 15 కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్ అవసరం. తుంగతుర్తిలో 14 మంది,హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 24 మంది, కోదాడ 34 మంది, సూర్యాపేటలో 20 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక్క బ్యాలెట్ యూనిట్, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల్లో రెండు, కోదాడలో 3 బ్యాలెట్ యూనిట్ల చొప్పున అవసరం.

బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు ఇలా..

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 308 పోలింగ్ కేంద్రాలు, కోదాడ నియోజకవర్గంలో 296, సూర్యాపేట నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాలు, తుంగతుర్తి నియోజకవర్గంలో 326 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తుంగతుర్తిలోని పోలింగ్ కేంద్రాలకు ఒక్కటి చొప్పున, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు రెండు చొప్పున, కోదాడ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు మూడు చొప్పున మొత్తం 2,372 బ్యాలట్ యూనిట్లు, అదనంగా 25 శాతం కేటాయిస్తారు కాబట్టి వీటన్నింటినీ కలుపుకుంటే మొత్తం 3,005 అవసరం అని అధికారులు గుర్తించారు.

ఈసీఐఎల్ నుంచి తెప్పించి..

గతంలో జిల్లాకు 2,435 బ్యాలెట్ యూనిట్లు, 1911 కంట్రోల్ యూనిట్లు, 1863 వీవీప్యాట్లు వచ్చాయి. వీటిని పరిశీలించిన తర్వాత ర్యాండమైజేషన్ చేసి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 308 పోలింగ్ కేంద్రాలకు 385 బ్యాలెట్ యూనిట్లు, కోదాడ నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలకు 372, సూర్యాపేట నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలకు 338, తుంగతుర్తిలోని 326 పోలింగ్ కేంద్రాలకు 407 బ్యాలెట్ యూనిట్లు కేటాయించారు. అనంతరం వాటిని ఆయా నియోజకవర్గాలకు తరలించారు. జిల్లాలో మిగిలి ఉన్న బ్యాలెట్ యూనిట్లు కాక అవసరం ఉన్న 570 బ్యాలెట్ యూనిట్లను శుక్రవారం తీసుకువచ్చారు. ర్యాండమైజేషన్ చేసి మూడు నియోజకవర్గాలకు అవసరాల మేరకు కేటాయించనున్నారు.

మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో పరిశీలకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణకు నియమించిన మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సాధారణ పరిశీలకులు కౌశిగన్, బాలకిషన్‌ముండా, వ్యయ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్‌లతో కలసి నాలుగు నియోజకవర్గాలకు ర్యాండమైజేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గుర్తించిన 173 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 173మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, హుజూర్‌నగర్‌కు 42మంది, కోదాడకు 43, సూర్యాపేటకు 33, తుంగతుర్తి నియోజకవర్గానికి 55మందిని కేటాయించినట్లు వివరించారు. రిజర్వ్‌లో 28మందిని ఉంచామని తెలిపారు. సమావేశంలో సీపీఓ జి.వెంకటేశ్వర్లు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఈడీఎం గఫార్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు నెరవేరలె



కేంద్ర మంత్రితో పాటు బీజేపీ అభ్యర్థి సంకినేనికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న ప్రజలు



పెన్‌పహాడ్‌లో ప్రచారం చేస్తున్న కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, పక్కన అభ్యర్థి సంకినేని

- కేంద్ర ఐటీ, సాంకేతిక శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

సూర్యాపేట : రాష్ట్రంలో తెలంగాణ అమరుల ఆశయాలు నెరవేరలేదని కేంద్ర ఐటీ, సాంకేతిక శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం పెన్‌పహాడ్‌లో సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ కార్యాలయాన్ని కేంద్రమంత్రి ప్రారంభించి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కొనసాగిందని, నీళ్లు రాలే నియామకాలు జరగలేదన్నారు. ఉద్యమ ఫలితాలను కేవలం కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబమే అనుభవిస్తోందన్నారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబమే శాసిస్తోందని విమర్శించారు. నోటిఫికేషన్లు వేసి పరీక్షలు నిర్వహించకుండానే ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన దుర్మార్గమైన ప్రభుత్వం కేసీఆర్‌ది అని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకపోగా కేసీఆర్ కుటుంబంలో రాజకీయ నియామకాలు జరిగాయన్నారు. కేటీఆర్‌కు ఐటీ ఉద్యోగం, కవితకు ఎమ్మెల్సీ ఉద్యోగాలు వచ్చాయన్నారు. సీఎం కేసీఆర్‌కు ఓటు వేస్తే రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. సూర్యాపేటలో మంత్రి జగదీష్‌రెడ్డి అనుచరులు డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా బెదిరించి, ఇబ్బందులకు గురి చేయడంతో కస్తూరి జనార్దన్ కుటుంబం ఆత్మహత్యలకు పాల్పడింది నిజం కాదా అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మంత్రి జగదీష్‌రెడ్డి మేనమామ మధుసూదన్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేసి డబ్బులు తీసుకుంది వాస్తవం కాదా అని అన్నారు. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని, గృహలక్ష్మి, బీసీబంధు పథకాలు బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే వచ్చాయన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడానికి ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే జిల్లాకు రైల్వే మార్గం తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీష్ రెడ్డి





ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన యువకులు, మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం అని విద్యుత్‌శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు అవసరమైన ఉద్యోగాలు సృష్టించాలన్నదే ముందున్న సవాల్ అని అన్నారు. గత పాలనలో, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి చెప్పే బాధ్యత యువత దే అని గుర్తు చేశారు. సూర్యాపేటలో శాంతి భద్రతల విషయంలో రాజీలేదన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రెండు ట్యాంక్ బండ్లు ఉన్న ఏకైక పట్టణం రాష్ట్రంలో సూర్యాపేటనే అని, మరోసారి ఆశీర్వదిస్తే నెక్లెస్ రోడ్డుని తలపించేలా మూడవ టాంక్ బండ్‌గా నల్లచెరువును మారుస్తానన్నారు. కారు గుర్తును గెలిపించుకొని భవిష్యత్తును నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. యువకులు సాయికుమార్, కాసం మని, అజయ్, వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రాంమ్మూర్తి యాదవ్, బత్తుల జాని పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తిని అవమానించేలా వ్యాఖ్యలు

- మంత్రి జగదీష్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కోమటిరెడ్డి బ్రదర్స్‌కు లేదు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చెరుకు సుధాకర్

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమ స్ఫూర్తిని అవమానించేలా కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్, సూర్యాపేట, తుంగతుర్తిలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన భాష, ప్రవర్తించిన తీరు అత్యంత అసహ్యకరంగా ఉందన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు జగదీష్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పునాది నుంచే జగదీష్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగరేసిన సత్తా ఉన్న నాయకుడు జగదీష్ రెడ్డి అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటుకు తాగనీయమని రాజగోపాల్ రెడ్డి మాటిమాటికీ అంటున్నారని అదేమైనా ఆయన అయ్య జాగీరు కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో శాసనసభ టికెట్లు ఇస్తామని కోట్లు దండుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. తాము పోటీ చేసిన చోట గెలవలేని కోమటిరెడ్డి బ్రదర్స్ ఇంకొకరిని ఎలా గెలిపిస్తారు? అని ఎద్దేవా చేశారు. వీరేశంను వీరుడు అన్న రాజగోపాల్ రెడ్డి అదే వీరేశం గతంలో హంతకుడు అన్నది కూడా నిజం కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు వైవి, నిమ్మల శ్రీనివాస్, డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, పుట్ట కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

● విజయ సంకల్పం



నల్లగొండలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, అభివాదం చేస్తున్న అభ్యర్థులు, నాయకులు



నల్లగొండలోని డీటీసీలో హెలికాప్టర్ దిగి వస్తున్న అమిత్‌షా, చిత్రంలో ఎంపీ కె.లక్ష్మణ్

● కమలం గూటికి..



సూర్యాపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

మంత్రిపై అభిమానం చాటుకున్న టైలర్



మంత్రి జగదీష్‌రెడ్డి కొలతలు తీసుకుంటున్న టైలర్ దేవేంద్రచారి

సూర్యాపేట: పట్టణంలోని తన షాపు ముందు నుంచి శనివారం మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కాన్వాయ్ వెళ్లడం గమనించిన టైలర్ దేవేంద్రచారి పరుగున వెళ్లి కాన్వాయ్‌ను ఆపాడు. దేవేంద్రచారిని గమనించిన మంత్రి వాహనం ఆపాల్సిందిగా సిబ్బందికి సూచించారు. మంత్రి వద్దకు చేరుకున్న దేవేంద్రచారి 'సూర్యాపేటలో మీరు చేసిన అభివృద్ధికి ఉడతా భక్తిగా మీరు సమ్మతిస్తే నా చేతులతో మీకు బట్టలు కుట్టి బహుమానంగా ఇస్తాను' అని తన కోరికను మంత్రికి తెలియజేశాడు. దీంతో మంత్రి కాన్వాయ్ దిగి టైలర్ దుకాణంలోకి వెళ్లి కొలతలు ఇచ్చారు. తన కోరికను తీర్చిన తీర్చిన మంత్రి జగదీష్‌రెడ్డికి టైలర్ దేవేంద్రచారి ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ హామీలు ఆచరణ సాధ్యం కావు

● కోమటిరెడ్డి బ్రదర్స్ ఆత్మవిమర్శ చేసుకోవాలి
● శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు ఆచరణలో సాధ్యం కావని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద అక్కసు వెళ్లగక్కడం ఒక్కటే కాంగ్రెస్ పార్టీ పని అని, ఖర్గేను డమ్మీగా పెట్టి కుటుంబ పాలన చేస్తున్నారని విమర్శించారు. నరేంద్రమోదీ పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ సమాజాన్ని అవమాన పరిచిన విషయం ప్రజలు మరిచి పోలేదన్నారు. కేంద్రం బీఆర్ఎస్ నాయకులపై పగబట్టి వారి అనుచరులపై ఐటీ దాడులు చేసి ఎన్నికల సమయంలో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ బీఆర్ఎస్ నకిరేకల్ అభ్యర్థి లింగయ్యపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని, వారు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.

'కాకి' సోదరుల మద్దతు ఎవరికి..?



ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట) : ఆత్మకూర్ (ఎస్) మండలంలో కాకి సోదరులకు రాజకీయ చరిత్ర ఉంది. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి అయినా.. కాకి దయాకర్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి మద్దతు కోరుతారు. తెలంగాణ ఉద్యమంలో కాకి సోదరులు ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఉద్యమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అనంతరం జరిగిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గెలుపులో భాగస్వాములు అయ్యారు. అయితే అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం కాకి దయాకర్‌రెడ్డి మృతి చెందారు. కాకి కృపాకర్‌రెడ్డి 2020 వరకు టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగారు. తర్వాత రాజకీయంగా దూరంగా ఉంటున్నారు. వారం రోజుల క్రితం దయాకర్‌రెడ్డి తనయుడు జార్జిరెడ్డి విదేశాల నుంచి ఆత్మకూర్ వచ్చి తమ అనుచరులతో రాజకీయ భవిష్యత్‌పై సమావేశం నిర్వహించారు. కాగా ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో సూర్యాపేట నియోజకవర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు కాకి సోదరుల మద్దతు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

భిక్షాటన చేస్తూ వినూత్న ప్రచారం



భిక్షాటన చేస్తూ ప్రచారం చేస్తున్న తెలంగాణ బతుకమ్మ పార్టీ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

ఆలేరురూరల్: తెలంగాణ బతుకమ్మ పార్టీ ఆలేరు అభ్యర్థి కందాడి మహిపాల్‌రెడ్డి శనివారం ఆలేరు పట్టణంలో భిక్షాటన చేస్తూ ప్రచారం నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధిచుకున్న తెలంగాణలో నిరుద్యోగల జీవితాలు అంధకారంలోకి వెళ్లిపోయాయని అన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆలేరు అభివృద్ధి శూన్యమన్నారు. ధన బలంతో గెలిచిన వారు తమ వ్యక్తిగత అభివృద్ధిని కోరుకుంటున్నారే తప్ప.. ఆలేరు ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదన్నారు. మైకు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రవి, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

● విద్యార్థుల మాక్ పోలింగ్



కోదాడలోని గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీఆర్ఎస్ పాలనలో అధికార దుర్వినియోగం

● మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి

యాదగిరిగుట్ట: బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను గద్దె దించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని జోస్యం చెప్పారు. యాదగిరిగుట్టలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆలేరు అభ్యర్థి బీర్ల ఐలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తూతూ మంత్రంగా దళితబంధు ఇచ్చారని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, నాయకులు కానుగు బాలరాజు, ఇంజ నరేష్, గుండ్లపల్లి భరత్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ రేగు బాల్‌నర్సయ్య తదితరులున్నారు.

జాతీయ, ప్రాంతీయ పార్టీలంటే..



భువనగిరి : జాతీయ, ప్రాంతీయ పార్టీలంటూ చదవడంతో పాటు వింటుంటాం. ఒక సార్వత్రిక ఎన్నికల్లో ఏదైనా రాజకీయ పార్టీకి ఏవైనా నాలుగు రాష్ట్రాల్లో పోలైన ఓట్లలో నాలుగు శాతం ఓట్లు వస్తే జాతీయ పార్టీగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. ఒక పార్టీ ఒక ప్రాంతంలో నాలుగు శాతం ఓట్లు వస్తే ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎన్నికల గుర్తులను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయిస్తుంది.

పేరు పక్కన టిక్ చేయాలి



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల్లో విధులు నిర్వహించే వారికి వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పించింది. బాలెట్ పేపర్‌పై గుర్తులు, అభ్యర్థుల పేర్లు ఉంటాయనుకుంటే పొరపడినట్లే. పార్టీల గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థుల పేర్లు మాత్రమే కనిపిస్తాయి. గతంలో ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్నే ఉద్యోగులకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ విధానం మారింది. ఇప్పుడు పోస్టల్ బ్యాలెట్‌పై పోటీ చేసే అభ్యర్థి, పార్టీ పేరు మాత్రమే ఉంటాయి. గుర్తు ఉండదు. అభ్యర్థి పేరు పక్కన టిక్ చేస్తే సరి పోతుంది.

ఎన్నికల చిత్రాలు

● వెయ్.. చిందెయ్



ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడలో మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

● గెలుపు మోత మోగాలె..



నల్లగొండలో డప్పు కొడుతూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి సతీమణి

● ప్రజలకు కాపరినవుతా..



భువనగిరి మండలం అనాజిపురంలో కార్యకర్తలు అందజేసిన గొర్రె పిల్లతో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ కుమార్‌రెడ్డి

● గూడూరు.. సినీ గ్లామరు



వలిగొండ వద్ద రోడ్‌షోలో బీజేపీ భువనగిరి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, రజాకార్ సినిమా నటులు

● ఓటు నీది.. సేవ మాది



బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్‌కు ఓటెయ్యాలని కోరుతూ జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో వృద్ధురాలికి సాయంగా గిన్నెలు కడుగుతున్న నాయకులు

తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదు

● ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

నల్లగొండ రూరల్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేరలేదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం నల్లగొండలోని టీజేఎస్ కార్యాలయంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో ఆ కమిటీ జిల్లా కన్వీనర్ దర్శనం నర్సింహ అధ్యక్షతన 'పదేళ్ల తెలంగాణ–ప్రజల ఆకాంక్షలు–కర్తవ్యాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు హరగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ ఆకాంక్షలతో తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారో నేడు అవి నెరవేరక రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశ స్థితిలో ఉన్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో సకల జనులు తమ ఓటును ఐదేళ్ల భవిష్యత్ కోసం సరైన ఆలోచన చేసి సరైన వ్యక్తులకు వేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా పాలిస్తున్నాయన్నారు. మంచి పాలన కోసం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే పాలకులను ఎన్నుకోవాలన్నారు. పాలించే నాయకున్ని ఎన్నుకున్న తర్వాత ప్రజల కొనుగోలు శక్తి పెరగకపోగా ఎన్నుకున్న నాయకుల సంపాదన పెరుగుతుందన్నారు. ప్రజల తరఫున పోరాటం చేసేందుకు తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం అతిథులు కన్నెగంటి రవి, గురువారెడ్డి, రవిచందర్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని, వారి వయసు మీరినా ఉద్యోగాలు, ఉపాధి కల్పన లేకపోవడంతో అడ్డా మీద కూలీలుగా జీవనం సాగించడం బాధాకరమన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



భగవాన్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు సర్వీసు వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మిర్యాలగూడ మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్లపల్లి గ్రామానికి చెందిన తంతనపల్లి భగవాన్(62) శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలోని బోరు మోటారు వద్ద సర్వీసు వైరు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా భగవాన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. శనివారం మృతుడి కుమారుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి శనివారం ఊట్లపల్లి గ్రామానికి చేరుకుని భగవాన్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ధన్సింగ్ తండాలో మృత్యుఘోష !

● గంటల వ్యవధిలో ముగ్గురి మృతి
● పురుగుల మందు తాగి ఇద్దరు.. అనారోగ్యంతో మరొకరు..
● తిరుమలగిరి (సాగర్) మండలంలో విషాదం



బాలు నాయక్ మృతదేహం



పద్మ మృతదేహం



మారుతికుమార్ (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం ధన్సింగ్ తండాలో మృత్యుఘోష తాండవించింది. ఒకే రోజు పురుగుల మందు తాగిన ఇద్దరు, అనారోగ్యంతో బాధపడుతున్న మరొకరు గంటల వ్యవధిలోనే మృతిచెందారు. తిరుమలగిరి(సాగర్) మండలం ధన్సింగ్ తండాలో ఒకే సామాజికవర్గానికి చెందిన 120 కుటుంబాలు నివసిస్తున్నాయి. 350మంది ఓటర్లు ఉన్నారు. వీరికి వ్యవసాయమే జీవనాధారం. తండాకు చెందిన సునావత్ బాలునాయక్(51) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. వారం రోజుల క్రితం మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలునాయక్ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఇదే తండాకు చెందిన నూనావత్ పద్మ (38) కుటుంబ కలహాలతో వారం రోజుల క్రితం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నల్లగొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం 4గంటల సమయంలో మృతిచెందింది.

తల్లిదండ్రులు మందలించారని..

ధన్సింగ్‌తండాకు చెందిన మేగావత్ మారుతికుమార్ (15) దామరచర్ల ఎస్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన మారుతికుమార్ గురువారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మిర్యాలగూడ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి సాయంత్రం 6గంటలకు మృతిచెందాడు. ఇలా ఒకే సామాజికవర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గంటల వ్యవధిలోనే మృతిచెందడం తండావాసులను కలచివేసింది. తండాలో నివసిస్తున్న వారంతా ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అందరికీ బంధుత్వం ఉండడంతో అందరూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. శనివారం ఒకరి తర్వాత మరొకరి దహనసంస్కారాలు నిర్వహించారు.

హైవేపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

బీబీనగర్: హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో వరంగల్–హైదరాబాద్ హైవేపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆయిల్ ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా పడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా మళ్లించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో లారీని రోడ్డు పక్కకు తరలించారు. రోడ్డుపై పడిన ఆయిల్‌ను శుభ్రం చేయించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.